# కృష్ణదేవరాయని కరుణాకృత్యం

శివరాజు వేంకట సుబ్బారావు

పాత్రలు

శ్రీకృష్ణదేవరాయలు – విద్యానగరరాజు
షామరాజు – 'అనామకుడు'
స్వరూపిణీదేవి – మహారాజు శుద్ధాంతంలోని వొక స్త్రీ
'చిట్టి' – పరిచారిక

స్థలం – జనానాలో స్వరూపిణి గది
సమయం – 1515 సం.,
ఒకరోజు సాయంత్రం 7.12 గంటలు

విజయనగర సామ్రాజ్యాన్ని గురించి చాలా గ్రంథాలు చదివినా, గ్రంథకర్తలు ఆనాటి శిల్పాన్ని గురించి చరిత్రాత్మకంగా, మిగతా దేశాలలోని శిల్పాలతో పోల్చి వ్రాయడం తప్ప ఆ శిల్పులను గురించి వొక్క విషయం కూడా చెప్పరు. వాళ్ళు ఎట్లాంటి వ్యక్తులు, ఎక్కడ నేర్చుకున్నారు, వాళ్ళ వేతనాలెంత



ఈ నాటిక ***1944*** – మే నెల భారతి సంచికలో మొదటిసారి అచ్చయ్యింది. బుచ్చిబాబు అసలు పేరుతో దీనిని ప్రచురించారు. తర్వాత మద్రాసు ఆకాశవాణి నుంచి ప్రసారమైంది. తెలుగు చలనచిత్ర సీమలో దృశ్యకావ్యంగా నాటికీ నేటికీ పరిగణించే మల్లీశ్వరి సినిమాకి బీజం యిదే.

రచయితగా తెలుగునాట అన్ని శాఖలలోనూ కొత్త వొరవడులు పెట్టిన బుచ్చిబాబుకి నివాళిగా యీ నాటికను మా పాఠకులకు అందిస్తున్నాం.

– నవ్య



మొదలైన జీవితాలకి సంబంధించిన విషయాలేవీ కనిపించలేదు. ఆ సామ్రాజ్యం పోయింది; కొన్ని శిల్పాలు మాత్రం మిగిలాయి. ఆనాటి వాతావరణాన్ని సృష్టించి, వొక శిల్పి అంతరంగిక జీవితాన్ని ప్రదర్శించి చూపుదామన్న సంకల్పానికి యీ నాటిక ఫలితం.

ఆంధ్రోత్పత్తి, కర్ణాటకవాదాలతో దీనికి నిమిత్తం లేదు. ఈ నాటికలో జరిగిన విషయాలకి చరిత్రలో ఆధారం లేదు. కాని అవి అసంభవం కాదు. మొదట కృష్ణదేవరాయలని వివాహమాడటానికి అంగీకరించని ముదుగల్లు కన్య 'నేహల్' కథ ఫెరిష్టా వ్రాశాడు. ఆమెలాంటి స్త్రీ, తిమ్మరుసు లాంటి పురుషుడూ వున్న కాలాలలో యిట్లాంటి వ్యక్తులుండడం అసహజం కాదు.

చరిత్రకారులు ఏకీభవించని విషయాలు బోలెడున్నాయి. పెయిస్, ఫిగెరిడో మొదలైన పోర్చుగీసులు 1520లో విద్యానగరానికొచ్చారని కొందరు, 1513లో వచ్చారని కొందరు అంటున్నారు. విఠోబాలయాన్ని కృష్ణదేవరాయలు ప్రారంభించారని కొందరూ, పూర్తిచేశాడని కొందరూ అంటున్నారు. ఇందులో కథకి అనుగుణ్యమైన అంశాలనే తీసుకున్నాను.

– రచయిత

***

(తెర లేవగానే 'స్వరూపిణీదేవి', 'చిట్టి' రంగం మీద కనబడతారు.

'చిట్టి' నల్లటి మనిషి. పసుపు రంగు, నల్లటి అడ్డ చారలు గల 5 గజాల బట్టని లుంగీ మాదిరి కట్టుకుంటుంది. మోచేతుల దాకా చేతులు గల రవిక, భుజాల చుట్టూ తిప్పిచుట్టిన 3 గజాల ఎర్రరంగు కండువా లాంటిది. కొంచెం పొట్టిమనిషి. చిన్న కళ్ళు, పెద్ద పెదవులు – జాగ్రత్తగా పరిశీలిస్తే ఆకర్షణీయమైన చిహ్నాలు లేకపోలేదు. వెడల్పు జడ, చెవులకి దుద్దులు, తివాచీ మీద కూర్చుని వీణతీగెలు మోగిస్తూ సరిచేస్తూ వుంటుంది.

'స్వరూపిణీ'ది చాలా నాజూకైన నడుం. చామనచాయ, పొడుగాటి ముక్కు, పొడుగుతో పోటీపడే నల్లటి కళ్ళు, గీతలు స్పష్టంగా కనపడే నిండైన పెదవులు, గుండ్రని చిన్ని గడ్డం మాట్లాడేటప్పుడు పెదవులతో సమంగా లయ కలుపుతూ కదులుతుంటుంది. మధ్యపాపిడి, నల్లత్రాచుపిల్లలలా మెలికలు తిరిగిన ముంగురులు, మెడ వెనుక రెండు చుట్టలుగా అమర్చబడ్డ జుట్టు, రెండింటిలోనూ బోలెడు రంగుపూలు, తలచుట్టూ తెల్ల రిబ్బను, నుదుటి మీద పాపిడి మొదట్లో 'మణి', చాలా జతల గాజులు. జబ్బకి బంగారు చుట్టు – దానినుంచి 'మణి' వేళ్ళాడుతుంది. నాట్యభంగిమలు స్ఫురణకి తెచ్చే చేతుల త్రిప్పుడు, మృదువైన కంఠం.

మంచం (ఉయ్యాల, లేక సోఫా) మీద కూర్చుని తమలపాకులకి సున్నం రాస్తుంటుంది.

ఒకమూల పెద్ద బల్ల, దానిమీద గాజు దీపం బుడ్డి – సిరా రంగుది, దాని పక్కన ఆముదపు శెమ్మా, దానివెనక పెద్ద అద్దం, బల్లమీద కొన్ని బట్టలు అమర్చబడి వుంటాయి. సోఫాకింద కలశం, తెల్ల ద్రాక్షపళ్ళ బుట్ట.

'చిట్టి' రాగం ఆలాపిస్తూ వీణతో శ్రుతికలుపుతుంది.)

*స్వరూ:* అబ్బ– ఆపవే, అదికాదు. ఈ పంజరం లోంచి నా హృదయాన్ని ఎగరేసుకుపొయ్యే పాట పాడాలి.

*చిట్టి:* పంజరం ఎక్కడుందమ్మా! మీరూ రుచీదేవిగారిమల్లే చిలకని పెంచరాదూ?

*స్వరూ:* దానికేం? ఎన్నేనా పెంచుతుంది. మొగ చిలక వున్నంతసేపూ ఆడచిలకని పెంచడం ఏం కష్టంలేదు.

*చిట్టి:* (పాడుతుంది, గ్రంథం చదువుతూ)

''మూసిన ముత్యమువై కడు
వాసియు వన్నెయును గలిగి వరు దౌననగా
నీ సకలబంధుకోటికి
బూసలలో దార మగుచు బొసగి మెలగుమీ''

*స్వరూ:* ఎక్కడిదే యీ పిచ్చపద్యం?

*చిట్టి:* మల్లనగారి రాజశేఖర చరిత్రలోది.

*స్వరూ:* మేమందరం పూసలం, కృష్ణరాయలు దారం! (ఆవలిస్తుంది) ఆ పుస్తకం మూసి – నా మనస్సుని ఎగరేసుకుపొయ్యే పిచ్చిపాట పాడు. పంజరం పాటలొద్దు.

*చిట్టి:* ఊరికే పంజరం పంజరం అంటారు. ఎందుకమ్మా. మీరొక్కరేనా? ఎంతమంది లేరిక్కడ. హాయిగా?

*స్వరూ:* ఇక్కడికొచ్చి ఐదు సంవత్సరాలైంది; వొక్కసారొచ్చాడే ఆయన – నువ్వే చెప్పు! కృష్ణవేణీ నదివొడ్డున తప్ప మళ్లా యింతవరకూ ఆయన్ని ఎప్పుడూ పరీక్షగా చూళ్లేదు. ఒక్కరాత్రి నాతో గడపలేదు. ఎప్పుడూ ఏవో సభలూ, తీర్మానాలూ, యుద్ధాలూ, ఊరేగింపులూ, నాట్యకత్తెలూ! నేనూ చిన్నప్పుడు చిలకల్ని పంజరంలో బంధించి పెంచుకున్నాను. నా పాపం వూరికే పోతుందా! హజారి రాముడు నన్నిందులో బంధించాడు.

*చిట్టి:* అదేమిటమ్మా అల్లా అంటారు మీరే వొచ్చారుగా యిక్కడికి?


*స్వరూ:* ఔను, నాకు జ్ఞానంలేని లేతరోజుల్లో, రాయలు నామీద చూపిన మోజుకి మా నాన్నా, అమ్మా మోసపోయి ధనసంపదలో తులతూగాలని నన్నిక్కడికి పంపించారు. మా నాన్నని చూసి ఐదు సంవత్సరాలైంది. తలుపు సందులోంచి, కిటికీ రంధ్రాల్లోంచి నే చూసిన మొగాళ్లని వేళ్లమీద లెక్కపెట్టొచ్చు.

*చిట్టి:* మీరెప్పుడూ సభలకీ, ఉత్సవాలకీ, ఊరేగింపులకీ వెళ్లరుగనక.

*స్వరూ:* వెళ్లేవాళ్లందరూ పట్టపురాణీలు, చదరంగంలో ఓడిపోయి దాసీలుగా మారి రాయలవారి పాదాలొత్తేందుకు నోచుకున్న పట్టమహిషులు. వాళ్ళకి నగలు, మంచి బట్టలు, వజ్రాలు, మణులు, ధనం వుంటే పురుషుడి పాదాలతో తృప్తిపడతారు. నాకు కావలసింది (నిట్టూర్పుతో) పెదవులుకాని పాదాలు కావు.

*చిట్టి:* (నవ్వుతూ) మీరు యింత బాగా మాట్లాడతారు – రాజుగారు మీ వల్లో ఎందుకు పడలేదమ్మా? ఎంత అందం మీది? ఆ చక్కదనం నాకుంటే నే మొగాళ్లని కుక్కపిల్లల మాదిరి ఆడించేదాన్ని.

*స్వరూ:* నా అందం నాకెట్లా తెలుసు? అద్దం తీసుకురా. (చిట్టి అద్దం ఆమెముందు నిలబెడుతుంది. అద్దంలోకి చూసుకుంటూ –) నా సౌందర్యానికి విలువ లేదే. ఏకాకిగా అరణ్యంలో వుండే యోగి మంచితనానికి ఎంత విలువ వుందో నా అందానికీ అంతే. ఒసే, ఒక విశేషం చెబుతా



విను. జీవితం అంటే కంబళిమీద శయ్య కాదు, కత్తి మీద సాము. రాజుగారి కిరీటంలో మణిగా వెలిగినప్పుడే నా అందం మెరిసిపోతుంది. పాట పాడు. (తాంబూలం నములుతూ పడుకుంటుంది. 'చిట్టి' ప్రేమని గురించిన పాట మొదలెడుతుంది.)

స్వరూ: (లేచి కూర్చుని) ఆపు. నా మనస్సు నాలో నిలవడం లేదే. ఏదో జ్ఞాపకం వస్తోంది. ఆ పచ్చికబయళ్లు, గొర్రెల మంద, నదీతీరం, తెరచాపలతో చలికి ముడుచుకున్న పడవలు, ముద్దుకోసం చంద్రుడికి దగరగా జరిగిన ఆ మొద్దు మేఘాలు - నేనాగలేనే. (లేచి పచార్లు చేస్తుంది. వొళ్లు విరుపుతో)

చిట్టి: (లేచి అటూ ఇటూ చూచి) మరిచేపొయ్యాం. యివాళ పూర్ణిమ. "చందమామ రావే, జాబిల్లి రావే...

స్వరూ: "మా స్వరూపిని తీసుకుపోవే" అదేనా నీ పాట? రాత్రి పది గంటలకి గ్రహణంటే? అంతా నదీస్నానానికెడతారు కాబోలు.

చిట్టి: ఈపాటికి వెళ్లేవుంటారమ్మా. అందుకే అంత నిశ్శబ్దంగా వుంది. మనం వెడదాం లేవండి.

స్వరూ: మనం అందరితోనూ వెళ్లొద్దు. వేరే - రాజుగారు బయలుదేరినప్పుడే వెడదాం. వారెక్కడున్నారో కనుక్కురా?

చిట్టి: అమ్మో! నే వెళ్లలేను. నాగాంబిక గారు చూశారంటే చంపేస్తారు. ఐనా మాదన్న గౌడాని అడిగొస్తానుండండి (వెడుతుంది).

స్వరూ: (వీణ తీగెలు మోగిస్తూ పాడడం మొదలెడుతుంది. పాట ఆపుచేసి మధ్యలో లేచి, కొత్త దుస్తులు బుజాలమీద వేసుకుని అద్దంలో చూసుకుంటుంది)

చిట్టి: (వచ్చి) తెలిసింది. దేవరాయలు విఠలాలయాన్ని చూడడానికి వెళ్లారుటమ్మా.

స్వరూ: అందులో చూసేందుకేముందే?

చిట్టి: ఆలయమంటే జ్ఞాపకం వొచ్చింది అమ్మగారూ, రాజుగారు కటకాధిపతిగార్ని జయించి వొచ్చింతర్వాత విజయసౌధాన్ని కట్టించారు, చూశారూ?

స్వరూ: లేదు.

చిట్టి: నేను మొన్న అల్లా వెడుతుంటే - అందరూ దాన్ని చూస్తో నిలబడ్డారు. నేనూ వెళ్లాను. అందులో వెనక రెండు ఆడబొమ్మలు రాళ్లమీద చెక్కి వున్నాయండి. నమ్మండి, నమ్మకపొండి - అచ్చంగా మీలాగే వున్నాయండి, ఆ సన్నటి నడుం, గుండ్రటి బుజాలు, ఆ ముక్కు అంతా మీరే.

స్వరూ: నిజంగానా? నన్నే మొగాడూ చూడలేదుకదా? లేక నన్ను పొగిడితే నీకేదైనా బహుమతి యిస్తానని అంటున్నావా?

చిట్టి: ఛీ, ఛీ! ఎంతమాట? పోనీ. మీరు చూడండి. ఆ నున్నటి మెడ, ఆ, ఆ, (నవ్వుతుంది సిగ్గుతో) .. రామలింగయ్య గారు ఆ బొమ్మ నేం చేశారో తెలుసా, వాటిమీద చెయ్యి పెట్టి .. (బిగ్గరగా నవ్వు)

స్వరూ: అనేకమంది స్త్రీల బొమ్మలు చెక్కితే అందు వొకటి నాలా వుండడంలో ఆశ్చర్యం లేదు. ఇవాళ ఏమైనాసరే, రాయలవారు ఆలయం నుంచి రాగానే ఎదురుగుండా వెళ్లి ఆయన్ని మాటల్లో పెట్టి ఆయనతో కలిసి స్నానానికెళ్లి తీరతానే.

(స్వరూపిణి ద్రాక్షపళ్లు తింటూ పచార్లు చేస్తుంటుంది.)

స్వరూ: ఆ ప్రేమని గురించి పాడిన పాటని మళ్లా పాడవే, ఒసే అనకూడదు కాని (దగ్గరగా వొచ్చి చెవిలో రహస్యంగా) శ్రీకృష్ణదేవరాయలు నీకేమన్నా బాగున్నాడే? మొహం నిండా స్ఫోటకపు మచ్చలు, ఆ పెద్ద చేతులు, మొద్దు పాదాలు - ఆలోచించి చెప్పు.

చిట్టి: (నోరు నొక్కుకుని) అమ్మయ్యో, అట్లాంటి మాటలే!

స్వరూ: నేనాయన్నంతగా పరకాయించి చూళ్లేదనుకో. ఆ హస్తాలలో ఎంత బలముందో, ఆ కళ్లల్లో ఎంత లోతుందో, ఆ పెదవులలో ఎంత మాధుర్యం వుందో నాకేం తెలుస్తుంది? ఆయనలో యివన్నీ వున్నాయనుకునే స్త్రీలు ఆత్మవంచన చేసుకుని, వాళ్లల్లో వున్నాయనుకున్న లక్షణాలు ఆయన కారోపిస్తున్నారంటాను, ఏమంటావ్?

చిట్టి: నాకు మీరు చెప్పింది వొక్కటికూడా అర్థం కాలేదు.

స్వరూ: (దగ్గరగా జరిగి ఒయ్యారంగా తివాసీ మీద కూర్చుని) ఒసే, నీ మనస్సు ఏ మొగాడి మీది



కేనా పోయిందే?

చిట్టి: మనస్సు పోవడం అంటే?

స్వరూ: అదే... వాళ్ల దగ్గర వుండాలనీ. వాళ్లని చూడాలనీ, పెండ్లి చేసుకోవాలనీ -

చిట్టి: ఎంతమంది మొగాళ్లండీ - అమ్మో - మీకు కోపం రాదుకదా - మా వీధి చివర వొక సాయిబు వుండేవాడు. సంతకి పోతుంటే వొకరోజున జడట్టుకుని లాగాడు. మళ్లా వాణ్ణి చూళ్లేదు. నాకు భలే కోపం వొచ్చింది.

స్వరూ: మళ్లా వాడు నీ దగ్గరకు రాలేదనా? (నవ్వుతుంది) నా చిన్నతనంలో నేనూ అంతేనే. మా వీధి చివర వీరపాంచాలుల గుడిసెలుండేవి. ఓ గొర్రెల కాపరి వుండేవాడే. నేను నదికి నీళ్లకి వెళ్లే సమయానికే వాడూ మందలతో చక్కా వొచ్చేవాడు. ఆ గట్టున కూర్చుని నన్నే చూస్తూ వుండేవాడు. ఇల్లా రెండు నెలలు. ఏమీ మాట్లాడేవాడు కాడు సుమా. నాకన్నీ జ్ఞాపకం వొస్తున్నాయి. నల్లగా వుండేవాడు. నల్లగా అంటే ఎట్లాగనుకున్నావు? వెన్నెల తాలూకు మెత్తని, పల్చని నలుపు. బుజాలూ - అవీ కండలు తిరిగి వుండేవాడు.

చిట్టి: ఎవరండీ వాడు?

స్వరూ: నువ్వెరగవులే. ఈవూరు కాదు. మావూరు. నేనిక్కడికి వొచ్చేస్తున్నానని వాడికెట్లా తెలిసిందో - రోజూ మా యింటిముందు అరుగు కింద నిలబడి, కిటికీలోంచి నేను నాట్యం నేర్చుకుంటూంటే చూస్తూ వుండేవాడు. ఆరోజుల్లో మందేశ్వరశర్మ నాకు నాట్యం నేర్పేవాడులే. నాకు వాణ్ణి చూడగానే సిగ్గువచ్చి పాట నిలిపి ఆగిపొయ్యే దాన్ని.

చిట్టి: మీరెప్పుడూ నాట్యం చెయ్యరేం - నాకు చూడాలని వుందండీ.

స్వరూ: నన్ను చెయ్యమని అడిగేవాడు లేండే? నే నీ నాట్యంతో రాయలని ఆకర్షించాలిట. రాణీవాసం వొచ్చింతర్వాత నాట్యం నాగలోకానికెళ్లింది. శుద్ధాంతంలో పడ్డతర్వాత నా శక్తులన్నీ శిలలుగా మారిపొయ్యాయి. సరే, ఇదంతా ఎందుకులే? ఏం, ఆమట్టున వాడేం చేశాడు - అదే, నేను రేపు యీ జనానాలోకి వొచ్చేస్తాననగా, రాత్రి మండువాలోకి చక్కా వొచ్చి నా చెయ్యి పట్టుకున్నాడు. వాడిని గుర్తుపట్టలేదు. ఎవరో అనుకున్నా, నోట్లో వున్న తాంబూలం వాడి మొహాన్న వూశాను. వాడేం చేశాడనుకున్నావ్? "ఆహా, ఆహా" అన్నాడు. తమ్మని ఏరుకుని తిండం మొదలెట్టాడు.

చిట్టి: ఏక్ - ఛ, ఛా! (మళ్లా సమర్థించుకుంటూ) లేదు, భలే పని చేశాడు. అబ్బా! (కళ్లు పెద్దవి చేస్తుంది).

స్వరూ: మొద్దూ, మొద్దూ చెప్పేది శాంతంగా విను, ఏం. ఆమట్టున నే లోపలికొచ్చేశానే.

చిట్టి: ఓస్, ఇంతేటండీ! నేనైతేనా -

స్వరూ: ఏం చేద్దువే? ఇప్పుడే కనక వాడొస్తే నేను ఏం చెయ్యను?

(చిట్టి ముక్కుమీద వేలేసుకుంటుంది. పక్క కిటికీలోంచి వొక బాణం వొచ్చి వాళ్లముందు పడుతుంది. దాని మొనకి వొక కాగితం తగిల్చి వుంటుంది. ఇద్దరూ ఆశ్చర్యమూ, కొంత భయమూ ప్రకటిస్తారు. చిట్టి కంగారుగా గంతులేస్తూ 'ఎవరు?' అని చప్పట్లు కొడుతూ అన్ని మూలలా చూడడం మొదలెడుతుంది. స్వరూపిణి ఆ కాగితాన్ని బైటికి తీసి చదువుతుంది)

"నువ్వు రాణివని నాకు తెలుసు. నేను సాధారణ మనిషిని. నిన్ను దూరంనుంచి చాలాకాలం ఆరాధించాను - కీటకం నక్షత్రాన్ని ఆశించినట్లు. ఈ జీవితంలో నేను చెయ్యగల పని చేశాను. ఇప్పుడు నాకు నీతో వొక గంటసేపు ఆంతరంగిక స్నేహం కావాల. ఆ తర్వాత చచ్చినా బ్రతికినా నాకు లెక్క లేదు. జవాబు పంపేవరకూ నేనిక్కడనుంచి కదలను. తూర్పున 13వ ద్వారం వద్ద తెల్లదుప్పటీ పాగా చుట్టుకున్న వ్యక్తి. ఇట్లు అనామకుడు"

స్వరూ: చిట్టీ, (చప్పట్లు కొడుతుంది) చాలా ఘోరం జరిగిందే. ఇదుగో, ఇది చదువుకో. మనం హాస్యంగా అనుకున్న సంగతులు ఎవడేనా విని, మనని పరిహాసం చెయ్యాలని యిట్లా చేశాడంటావా? నాకు చాలా కోపం వొచ్చిందని తెలుసుకో.

చిట్టి: పోనీ జవాబు పంపితే? చూద్దాం ఎవడో.

స్వరూ: ఛ, ఛా! నేనెవర్ని? ఒళ్లు దగ్గర వుంచుకో.



జనప్రియ యుటోపియా, హైదర్‌గూడ వద్ద (అత్తాపూర్)

లగ్జరీ జీవనానికి 2&3 బెడ్‌రూమ్ డీలక్స్ ఫ్లాట్స్

అన్ని అధునిక హంగులతో...

అధునాతన సౌకర్యాలైన క్లబ్, జిమ్స్, స్విమ్మింగ్ పూల్స్, ఇండోర్ & అవుట్‌డోర్ గేమ్స్, ఇంటర్‌కం సిస్టమ్స్, సందర్శకుల వసతి, క్రష్, షాపింగ్ కాంప్లెక్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రతి ఫ్లాట్‌కి ఓవర్‌హెడ్ ట్యాంక్, మిని ధియేటర్, చిల్డ్రన్స్ పార్క్, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ లాంటి మరెన్నో హంగులతో అల్ట్రా మోడ్రన్ టౌన్‌షిప్.

సౌకర్యాల చిరునామా...

సెక్రటేరియట్, అసెంబ్లీ నుండి కేవలం 9 కి॥మీ॥ దూరంలో మోహదీపట్నానికి దగ్గరలో హైదర్‌గూడ వద్ద (అత్తాపూర్).

అందుబాటు ధరలు...

3 బెడ్‌రూమ్ ఫ్లాట్ (1475Sft, 1400 Sft, 1285 Sft, 1260 Sft, 975Sft) రూ. 7,31,250/- నుండి రూ. 12,02,125/- వరకు

2 బెడ్‌రూమ్ ఫ్లాట్ (800 Sft & 700 Sft) రూ. 5,25,000/- నుండి రూ. 6,52,000/- వరకు


జనప్రియ విల్లాస్, బడంగ్‌పేట్

ఆకర్షణీయమైన ఇండిపెండెంట్ గృహాలు

జనప్రియ ఇంజనీర్స్ సిండికేట్ క్రొత్త వెంచర్ జనప్రియ విల్లాస్ ఇండిపెండెంట్ డూప్లెక్స్ ఇళ్ళ సముదాయం కోఠికి కేవలం 13 కి॥మీ॥ దూరంలో, సంతోష్ నగర్‌కి 7 కి॥మీ॥ చేరువలో DRDO టౌన్‌షిప్‌కి కేవలం 4 కి॥మీ॥ దగ్గరలో బాలాపూర్ 'X' రోడ్స్ కి కేవలం 2 కి॥మీ॥. ఆర్.టి.సి. బస్ సౌకర్యం కలిగిన ఈ ప్రాంతంలో 220 ఇండిపెండెంట్ గృహ సముదాయాన్ని జనప్రియ నిర్మిస్తున్నది.

- తారురోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజ్, మంచినీటి సౌకర్యం
- ప్రతి ఇల్లు ప్రశాంత వాతావరణంలో వాస్తు ప్రకారం నిర్మాణం.

అందుబాటు ధరలు...

3 బెడ్‌రూమ్ డూప్లెక్స్ ఇళ్ళు (130 Sq. Yds లో 1150 Sq.ft) రూ. 8,40,000/- మాత్రమే

2 బెడ్‌రూమ్ డూప్లెక్స్ ఇళ్ళు (72.2 Sq. yards to 111.11 Sq. Yds లో 780 Sq.ft. to 1020 Sq.ft) రూ. 5,15,000/- నుండి రూ. 7,35,000/- వరకు


జనప్రియ మహానగర్, మీర్‌పేట్

ఆకర్షణీయం, అందుబాటు ధర, ఆశ్చర్యకరం, జనప్రియ గృహాల - అనుభూతి

కోఠికి కేవలం 9 కి॥మీ॥ దూరంలో DRDL, మిధాని పరిసరాల్లో 1200 ఫ్లాట్ల సముదాయం జనప్రియ మహనగర్. క్రమమైన ఆదాయం కలిగిన వారెవరైనా 2 బెడ్‌రూం ఫ్లాట్ రూ. 1,76,175/- లకు సహితం సొంతం చేసుకోవచ్చు. ప్రైవేట్ ఉద్యోగస్తులకు, చిన్న వ్యాపారస్తులకు, వ్యవసాయదారులకు, క్రమమైన ఆదాయం. కలవారు ఎవరైనా "అద్దె డబ్బుతో సొంత ఫ్లాట్" అనే ఈ పథకం ద్వారా సొంత ఫ్లాట్‌ను పొందండి. ఇప్పటికే వెయ్యిమందికి పైగా ఈ ప్రాజెక్టులో సొంతింటి వారయ్యారు.

అందుబాటు ధరలు...

2 బెడ్‌రూమ్ ఫ్లాట్ (435 Sft to 585 Sft) రూ. 1,76,175/- నుండి రూ. 2,77,875/- వరకు

కార్పొరేట్ ఆఫీస్: జనప్రియ ఇంజనీర్స్ సిండికేట్, 3-6-115, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 29
☎: 040 - 23222999, 23222666, 23222333, Fax No. : 23227515
e-mail : sales@engineerssyndicate.com, website : www.janapriya.com

బ్రాంచ్ ఆఫీసెస్:
జనప్రియ యుటోపియా, హైదర్‌గూడ, అత్తాపూర్ ☎: 040 - 30909982, 30909983, 30909984
జనప్రియ విల్లాస్, బడంగ్‌పేట్ ☎: 040 - 30909989
జనప్రియ మహానగర్, మీర్ పేట్ ☎: 040 - 30909986

JANAPRIYA ENGINEERS SYNDICATE


K. RAVINDAR REDDY
B.Tech (Civil), MIE, MIGS
Chairmen & Managing Director

CITIZEN ADS

రాయలని బానిస చెయ్యడానికి సంకల్పించి యీ ఖైదుకి బలి అయిన నన్ను వొక సామాన్య అనామకుడు తాకడానికి సాహసిస్తాడా? రాయలు రాగానే చెప్పి వాణ్ణి ముక్కలుముక్కలుగా కోయిస్తాను.

*చిట్టి:* (భయపడుతూ) అయ్యో, పాపం! నేను 13వ ద్వారం దగ్గరకెళ్లి చూసొస్తా, అంత ఆగ్రహపడకండమ్మా.

*స్వరూ:* (కొంచెం శాంతించి) ఓవేళ కృష్ణరాయలే నన్ను పరీక్ష చేద్దామని యిట్లా తమాషా చేశాడంటావా? అబ్బే! నాకు నమ్మకం కుదరడం లేదే. ఆలయానికి వెళ్లిన మహారాజు, చంద్రగ్రహణం నాడు ఎన్నో కృత్యాలు నెరవేర్చవలసి వుండగా నాతో పరాచికాలాడుతూ కూర్చుంటాడటే – నా వెర్రి కాక? ఐదు సంవత్సరాల నుంచి లేని ప్రేమ యీనాడు బైలుదేరిందా – నేను నమ్మనే. వీడెవడో దుండగీడు. పొగరుబోతు. నేనంటే అసూయతో కుళ్లిపోతున్న నా సవతుల ప్రేరేపణల వల్ల ఎవడో తుంటరి బహుమానాలకి ఆశపడి పన్నిన పన్నాగం ఇది. ఈ అనామకుడికి శరీరం కూడా లేకుండా చేస్తానే.

(అటూ యిటూ పచార్లు చేస్తుంది – విసుగు, రుసరుస నటించి అద్దంలో చూసుకుంటుంది. అందులో సోఫాకింద వున్న కలశాన్ని చూస్తుంది. వెనక్కి తిరిగి ఆ కలశాన్ని పైకి తీస్తుంది. డ్రాయరు యివతలికి లాగి అందులోంచి వొక సీసా తీసి, దానిలోని ద్రావకాన్ని కలశంలోకి గుమ్మరిస్తుంది)

చిట్టీ, చిట్టీ ఎక్కడ? (చప్పట్లు కొడుతుంది. వెనకాలే వున్న చిట్టి ఉలిక్కిపడి –)

*చిట్టి:* అమ్మా, ఇక్కడే వున్న.

*స్వరూ:* వాడిని యిక్కడికి రప్పించి, దీనితో నిర్మూలం చేస్తాను. (కలశాన్ని పైకి ఎత్తుతుంది) ఉండు, మంచి భావం తట్టింది. (చిటికవేసి, చిరునవ్వుతో కూర్చుని) చెబుతా రాయి – దానికి జవాబు.

(చిట్టి కాగితం, కలం తీసుకొస్తుంది.)

*స్వరూ:* తే యిల్లా తే. (ఏదో రాస్తుంది. దాన్ని కోపంతో చించివేస్తుంది) ఆ అనామకుణ్ణి యిల్లా తగులడమని చెప్పు – పరుగెత్తు.

(చిట్టి నిష్క్రమిస్తుంది. స్వరూపిణి లేచి అద్దం దగ్గరగా వెళ్లి దానిలో చూసుకుని తన బట్టలు, వొళ్లు సర్దుకుంటుంది. కొత్త ఎర్రకండువా కప్పుకుంటుంది. చెవులకి రుద్రాక్ష లోలాకులు తగుల్చుకుంటుంది. కుంకంతో పొడుగాటి బొట్టు, దానికింద నల్లటి చుక్క పెట్టుకుంటుంది. సోఫామీద వున్న బట్టలని విప్పి మంచం పైకమ్మీలకు తెరకింద కడుతుంది. తమలపాకులకి సున్నం రాస్తుంటుంది.

ప్రవేశం : 'చిట్టి', ఆమె వెనక 'షామరాజు'.

అతని వేషం – తలపాగా పచ్చనిరంగుది; మరీ వొదులు కాని లాగు; వొదులు కమ్మీను; కుడిభుజం పైన నల్లగళ్ల కండువా; పెద్ద గింగిరాల జుట్టు; మధ్య పాపిడి; చెవులకి చక్రాలు (రింగ్స్); సన్నటి మీసం, ఛామనఛాయ, నిశ్చలమైన చూపు. అసలు మొహమంతా నిశ్చలత్వాన్ని సూచిస్తుంది. మాటలు పట్టిపట్టి మెల్లగా మాట్లాడుతాడు. లావు బుజాలు, పొడవైన చేతులు, చేతిలో కర్ర.

వాళ్లకి కనబడకుండా స్వరూపిణి తెరవెనక దాగి వుంటుంది.

*చిట్టి:* దా, రాణీకి నమస్కరించు.

*షామ:* (నవ్వుతాడు) నీకు కావాలంటే నమస్కరిస్తాను. సౌందర్యవతి అయిన ప్రతి స్త్రీకీ నా హృదయం నమస్కరిస్తూనే వుంటుంది.

*చిట్టి:* నీ చావు మూడిందిలే. ఏం పొగరుగా మాట్లాడుతున్నావు.

*స్వరూ:* నువ్వు చేసిన దారుణకృత్యానికి నీకు శిక్ష తెలుసా? నా కంఠాన్ని వినేటందుకే అర్హత లేని అనామకుడివైన నువ్వు – నిన్ను నిన్ను... ఏం చెయ్యాలి!

*షామ:* ఆ కంఠాన్ని విందామనీ, ఆ రూపాన్ని చూద్దామనీ ఎన్నో సంవత్సరాలు కాచుకున్నాను. నన్ను ఏం చేసిన సరే మీ యిష్టం.

*స్వరూ:* నీ పేరు?

*షామ:* మొదటే విన్నవించాగా అనామకుడని?

*స్వరూ:* అప్రస్తుతం, అసందర్భం. పేరు చెప్పు.

*షామ:* పేర్లతో సంబంధమేముంది రాణీ. మిమ్మల్ని స్వరూపిణీ దేవి అని కాక 'కురూపిణీదేవి' అని పిలిస్తే మీ సౌందర్యం మారుతుందా? నేనది చూడడానికే వచ్చాను.

*స్వరూ:* ఎంత నిర్లక్ష్యం!

*షామ:* నేను నియమాలని, సంప్రదాయాలని, కట్టుబాట్లని, సంఘనీతిని లక్ష్యం చెయ్యను. అసలు మీ వ్యక్తితో, మీ హోదాతో నాకు నిమిత్తం లేదు. మీ


దీపావళి శుభాకాంక్షలు



Quality Service is
Our Speciality



A Right Choice!
For your Marriage / Receptions / Birthdays /
Kitty Parties & All Functions.

We undertake outdoor Catering also

Only Veg.

RAGHAVENDRA CATERERS

# 7-10-22, Raghavendra Nagar, Nacharam, Hyd.
Call : K. Ravi Kumar
Ph: 040- 27175995, Mobile : 9391332107 / 9246579647

సౌందర్యం చూడాలి.

స్వరూ: నేనెవర్నో తెలుసా?

షాము: ఆ, రాయలగారి వుంపుడుకత్తె కావొచ్చు. మర్యాదగా వారి భార్య అనొచ్చు. సామాన్య ప్రజలకి రాణి, తోటిరాణీలకు సవతి. సంతానం వుంటే తల్లి. నాకు వొక సౌందర్యవంతమైన ఆదర్శం.

చిట్టి: అసలు నువ్వు ద్వారం దగ్గరకెల్లా వొచ్చావు? మేము యీ మేడలో వుంటామని నీకెట్లా తెలుసు?

షాము: నేను నీకోసం రాలేదు. ఊరుకో నా చిన్ని నిమ్మపండూ.

స్వరూ: (నవ్వు ఆపుకుంటూ) నీకు భార్య వున్నదా?

షాము: లేదు. నా దగ్గర నౌకరీ చెయ్యడానికి ఏ స్త్రీ అంగీకరించలే. నాకు అన్నం పెట్టే శక్తి లేదు గనక.

స్వరూ: భార్య నౌకరీ చెయ్యడం ఏమిటి? గూఢార్థం గోచరిస్తోంది.

షాము: వాళ్లనీ, వాళ్ల కుటుంబాలనీ అన్నం, బట్టా పెట్టి పోషించగలడు గనక యీ జనానాలో స్త్రీలందరూ రాయలవారికి భార్యలుగా అమ్ముడుపోయారు. అంతకంటే వేరే గూఢార్థం లేదు.

స్వరూ: హద్దుమీరి మాట్లాడుతున్నావు.

చిట్టి: నీకు చావు మూడిందిలే.

షాము: నువ్వూరుకో నా బుల్లి దానిమ్మపండూ.

స్వరూ: నీ వృత్తి?

షాము: మీ అమాయకత్వానికి నవ్వొస్తోంది. నాకు వృత్తే వుంటే బోలెడుమంది స్త్రీలు నాకు భార్యలుగా అమ్ముడుపోదురు. మనదేశంలో ప్రతి మొగాడికి ఐదుగురు ఆడాళ్లున్నారు. వీళ్లని పోషించే శక్తి, సంతోషపెట్టే శృంగారం యీ మొగాళ్లలో లేకపోవడం వల్లనే యీ విద్యానగరంలో ఎక్కడ చూసినా వారకాంతలే.

స్వరూ: అప్రస్తుతపు ప్రేలాపన ప్రేలక నీ పనేమిటో చెప్పు.

షాము: నా వృత్తి సౌందర్యం సృష్టించడం.

స్వరూ: ఇక్కడికి నీ ప్రాణాల మీద ఆశ పెట్టుకునే వొచ్చావా?

చిట్టి: బాగా అడిగారు.

షాము: నువ్వు తమాయించు నా చిట్టి తమ్మీ. లేదు. నాకు బాంధవ్యాలూ, స్నేహాలూ, చుట్టరికాలూ లేవు. ప్రపంచం నాకు పరలోకం. మిగతా మానవులు ఏమీ చేతకాక వొట్టి శుంఠలై యీలోకానికి లొంగిపోయి - ఖజానా గుమాస్తాల కింద అమ్ముడుపోయి, అందమైన వొస్తువును అనుభవించడానికి ధైర్యం, తెగింపూ లేక, గౌరవనీయులైన నీతిపరులకింద యీ ప్రపంచ రథచక్రాలని పట్టుకు కూర్చున్నారు. వీళ్లలా నేనూ వుంటే యీ సాహసం యెల్లా చేస్తా. మీరే చెప్పండి. నాకు యథార్థమైన శరీరం వుంటే యిక్కడికి వొచ్చే వుండను. శరీరాన్ని శ్మశానంలోనూ, వ్యక్తిత్వాన్ని విబూదిలోనూ గిరవాటెట్టి, నా యథార్థమైన హృదయాన్ని మీముందు పారేసుకుంటున్నాను. దాన్ని తృణీకరించొచ్చు; హింసించొచ్చు; తన్నొచ్చు; త్యజించవొచ్చు - కానీ దాన్ని చంపలేరు.

స్వరూ: దాన్ని చంపడమే నా సంకల్పం.

షాము: మీ హృదయాలని జనించకుండానే చంపుకున్న మీకు హృదయానికి చావు లేదని ఎట్లా తెలుస్తుంది - నా వెర్రికాకపోతే!

స్వరూ: నీ వొక్కడి హృదయమేనా చావులేంది?

షాము: కావొచ్చు. ఈ చీరలకోసం, ఈ నగలకోసం, ఈ హోదాకోసం అన్యులు మిమ్మలని చూసి అసూయపడాలన్న మీ గుడ్డి కోరిక - యివే యథార్థాలనుకుని నమ్మి, మాతృత్వ, స్త్రీత్వం మొగ్గలోనే తుంచిన మీ మలిన శరీరంలో హృదయం ఎక్కడేడిసింది! ఉంటే రాయలకి యింతమంది స్త్రీలెందుకు?

స్వరూ: ఇంక నీకిచ్చిన గడువైపోయింది. నీకు కావల్సింది నాతో మాట్లాడడం. అది జరిగింది. కాబట్టి యింక....

షాము: మీరు నాకు కనబడాలి - ఏకాంతంగా. రాణీనన్న సంగతి మరచిపోయి, స్త్రీగా నా ప్రేమని ఆహ్వానించాలి.

స్వరూ: (ఆలోచించి) సరే నీముందు కనబడతాను. కాని అది జరిగిన మరుక్షణానే నువ్వు చావడానికి సిద్ధంగా వుండాలి. ఇదుగో యెదురుగా బల్లమీద కలశంలో విషం వుంది. దాన్ని తాగాలి.



షామ: దానికి సిద్ధం. ఎప్పుడో చచ్చిన యీ శరీరాన్ని యింక యీ విషాలేం చేస్తాయి? మీ సౌందర్యం మీద నిలిచిన నా కళ్లు - మళ్లా యీ రాళ్ల గుట్టలని ఎలా చూస్తాయి?

స్వరూ: నీకోసం ఏడ్చేవాళ్లు ఎవ్వరూ లేరా?

షామ: ఉన్నారు.

చిట్టి: ఎవరు?

షామ: నువ్వు.

చిట్టి: ఛీ, ఛీ! ఏం పొగరు?

షామ: నీతో కాదు మాట్లాడింది నా నల్ల ఉడతపిల్లా.

స్వరూ: నేనా - దుర్మార్గుడా...!

షామ: ఈ అర్థశూన్యమైన ప్రశ్నలచే కాలం వృథా చేస్తున్నారు. అవును, నాకోసం ఏడ్చేది మీరే. సృష్టికర్తని నేను. మీకు మాతృత్వం అర్పించే శిల్పం కోసం మీరు ఏడుస్తూ వుంటారు. మాయింటి ఎదురుగా చెరువొకటి వుండేది. అందులో కెరటాలు గట్టున పడి చేసే చప్పుడు ఎదురుతిరగడం చేత కాక, పైకి చెప్పుకోలేక కుళ్లికుళ్లి ఏడ్చే ప్రాచీన స్త్రీల ఏడ్పు చప్పుడులా వుంటుంది. సరస్సులో కెరటాలు గట్టున వయ్యారంగా పడనట్లు మా కన్నీరు మీ రొమ్ము వొంకర్ల మధ్య జారతాయి - శక్తికోసం తపించే పల్చని, మధురమైన కన్నీరు. ఏకాంతసౌధంలో బంధింపబడ్డామని తెలుసుకున్నప్పుడు మనమందరం అల్లానే నిశ్శబ్దంగా ఏడుస్తూ వుంటాము. పురుషుడి ఘనమైన, నిండైన కలలని మీ కన్నీరు నీరుగా, శూన్యంగా మారుస్తుంది. స్త్రీ కన్నీరులో మునిగి చావడం తప్పనే నేను మీ సౌందర్యమైన కన్నీటిలో మునిగి, రెండు మధురమైన గుటకలేసి చావడానికి సిద్ధంగా వున్నాను.

(స్వరూపిణి తెర తొలగించి అతనిముందు సోఫాలో దర్జాగా కూర్చుంటుంది. కనుసంజ్ఞతో చిట్టిని పంపేస్తుంది)

స్వరూ: ద్వారం భద్రం... చప్పట్ల వినికిడికి ఎగిరి రావాలి, తెలిసిందా?

(చిట్టి నిష్క్రమణ. అతన్ని చూసి ఆశ్చర్యంతో, ఖంగారుతో లేచి రెండడుగులు వెనక్కి వేస్తుంది. అతను పాగా తీస్తాడు.

నువ్వు - నువ్వు - నదీ తీరాన్న నాకేసి చూసే నువ్వు ఎంత మారిపొయ్యావు!

షామ: చాలాకాలం తర్వాత నన్నిదే చూడడం వల్ల నా మార్పు నీకు తెలుస్తోంది. కాని నాకు నీలో ఏమీ కొత్తలేదు. ప్రతినిత్యమూ నా వూహాప్రపంచంలో ఏకాంతంగా తిరుగాడే నువ్వు నాకు చిరపరిచితురాలవే. పురుషుడి హృదయం ఎట్లాంటిదో ఎరగని నీకు పురుషుడిపై ఎంత కాఠిన్యం, ఎంత రోత రూపం!

స్వరూ: నాపేరు నీకెట్లా తెలుసు? నేనిక్కడుంటానని ఎట్లా ఎరుగుదువు? నాకంతా గొడవగా వుంది. నాకు మతిపోతోంది. (మొహాన్ని చేతుల్లో దాచుకుంటుంది)

షామ: రూపం, ఈ లోకంలో నే బ్రతికేది కొన్ని నిమిషాలు. ఈ కాసేపూ నన్ను కరువుతీరా నీ రూపాన్ని చూడనీ. నన్ను ప్రశ్నలు వేసి, గతించిన జ్ఞాపకాలతో నా ఆనందాన్ని కలతపెట్టకు.

స్వరూ: నాలో ఏముంది? నేనొక బానిసని - నిర్భాగ్యురాలిని.

షామ: అదంతా తాత్కాలికమైన వంచింపు. నువ్వొక రాణివి. నువ్వెంతో అదృష్టవంతురాలవు గనకనే కృష్ణదేవరాయల భవనంలో పడ్డావు. మేమందరం నీ అందానికి బానిసలమే. రాజుకి నీకు చాకిరీ చేసేందుకు వ్యవధీ లేదు, ఓపికా లేదు. నాకు రెండూ వున్నాయి.

స్వరూ: నీ మాటలు నన్ను ఎంతో బాధ పెడుతున్నాయి. ఎట్లా పిలవను నిన్ను?

షామ: 'షామా!' అని పిలువు. నీ బాధ నాకెంతో సంతోషం కలగచేస్తోంది.

స్వరూ: నా చుట్టూ శిలలు. నేనొక శిలని - షామా.

షామ: ఆ శిలలలోని ప్రాచీనం నువ్వు సంపాదించుకున్నావు. సంధ్యాసమయాల సుకుమారమైన ఎరుపు నీది; వెన్నెల బరువుని మొయ్యలేక భయపడి పరుగులెత్తే కెరటాల నురుగు చాంచల్యం నీ కళ్లది. చీకటి అడవుల పవిత్ర ప్రశాంతం నీలో వుంది. అనిశ్చలత్వ, వక్షోభారం మొయ్యలేక ముక్కలుగా విరిగిపడే ఆ నడుం - అన్నీ శిలాకారంగా ఏనాడో మార్చాను.

స్వరూ: నీకెందుకిట్లాంటి పిచ్చి...? అబ్బ - నా కేడుపొస్తోంది. ఆనాడే ఎందుకు చెప్పలేదు?

షామ: నాది వాంఛ కాదు; నోరులేని ప్రేమ. నాకేమీ అక్కర్లేకపోయింది. నువ్వు యీ మేఘాల మాదిరి, ఆ నదిలో కెరటాల మాదిరి, ఆ కొండల మాదిరి, నక్షత్రాల మాదిరి మార్పులేక, నశింపు లేక. శాశ్వతంగా యీ లోకంలోనే వుంటావనుకునేవాణ్ణి. తరవాత అది 'భ్రమ' అనీ తెలుసుకున్నా. ఏదో వెర్రి

## ప్రేక్షక హృదిలో భానుమతి స్వర్గసీమ



పాట కారణంగా ఒక తెలుగు సినిమాకు జనం పట్టాభిషేకం చేయడమన్నది బహుశా స్వర్గసీమతోనే ఆరంభమయిందనుకోవాలి. భానుమతి పాడిన ఓహోహో పావురమా... పాట ఈ సినిమాకు ఒక పెద్ద బాక్సాఫీసు ఆకర్షణయి కూచుంది. బ్లడ్ అండ్ సాండ్ సినిమా దీనికి ప్రేరణ. అందులో నాయిక రీటా హేవర్త్. ఆవిడకూడా ఆరోజుల్లో సినిమా అభిమానులను ఓ వూపు వూపింది. ఆ సినిమాలో ఆవిడ ఒక సన్నివేశంలో గిటార్ మీటుతూ ఒక స్పానిష్ ట్యూన్‌ను హమ్ చేస్తుంది. అది భానుమతి మనసులో బాగా నాటుకుంది. సినిమాలో ఆవిడ పాత్ర పేరు సుజాత. నిజానికి ఈ సుజాత మొదట వీధి భాగవతులతో వూరూరా తిరిగే సంచారతండా పిల్ల. పేరు సుబ్బి. ఆ తరువాత కథానాయకుని వల్లో వేసుకుని అంచెలంచెలుగా సుబ్బులు, సుబ్బలక్ష్మి, సుజాత, సుజాతాదేవిగా ఎదుగుతుంది. నాయకుణ్ణి కవ్విస్తూ తనకో పాట పెట్టాలని బి.ఎన్. అనుకున్నప్పుడు భానుమతికి ఈ ట్యూన్ గుర్తుకువచ్చింది. ఆ స్పానిష్ ట్యూనుకు కాస్త సింధుభైరవిని రంగరించి నాగయ్య, ఆవిడా ట్యూన్ తయారుచేశారు. పాట రజనీ రాశారు. మ్యూజిక్ సిట్టింగ్‌లో భానుమతి పావురాన్ని పట్టుకున్నట్టు చేతి రుమాలును పట్టుకుని అభినయ పూర్వకంగా ఆ పాటని ఆలపించగానే బి.ఎన్. సంతోషానికి అవధులు లేవు. 'కుదేల్ బ్రదర్... జనం కుదేల్...' అన్నారు సంబరంగా. ఏదైనా బ్రహ్మాండం అని చెప్పేందుకు ఆయన ఈ కుదేల్ పదం వాడేవారు. చక్రపాణి కూడా నవ్వుతూ బావుంది అన్నారు. ఆయన సాధారణంగా నవ్వరు. బావుంది అని అస్సలనరు. ఆయన బావుంది అంటే అది నిజంగా బ్రహ్మాండమేనన్నమాట. న్యూటోన్ స్టూడియోలో పాట రికార్డింగ్ జరిగినప్పుడు మొత్తం అక్కడి సిబ్బంది అంతా ఆరోజు థియేటర్ ముందే వున్నారు. అలా షూటింగుకు కూడా వెళ్లకుండానే ఆ పాట సూపర్‌హిట్టయింది. సినిమా విడుదలయ్యాక మొత్తం దక్షిణాదిని ఓ వూపు వూపింది. తమిళనాడులో అప్పట్లో బాయ్స్ కంపెనీ అని ఓ నాటకసంస్థ వుండేది. అందులో సూదంటురాయిలా ఓ కుర్రాడుండేవాడు. అతనీ సినిమాను కేవలం పావురమా పాటకోసం నలభైసార్లు చూశాడు. ఆ తరువాత అతను తమిళ సినిమా పరిశ్రమకు చక్రవర్తి అయ్యాడు.

అతని పేరు శివాజీ గణేశన్!

నమ్మకం, నువ్వెక్కడున్నా, ఎట్లా వున్న నాదానవనే ననుకుని తృప్తిపడేవాణ్ణి, ఈ గాలి మనిద్దరికోసం, సూర్యచంద్రాదులు మనకోసం – అదీ భ్రమే.

*స్వరూ:* సుఖపెట్టే భ్రమని వొదులుకుని మళ్లా యెందుకు యిట్లా వొచ్చి నన్ను బాధపెడతావు శామా? నీకు నేనెందుకు కనిపించాను?

*శామ:* నిజంగా సంతోషం కలగజేసే ప్రతి భ్రమలోనూ చెప్పరాని బాధ వుంది. సూర్యోదయానికి లోకం ఆనందంతో ఎదురుచూస్తుంది. కాని సూర్యుడు తూర్పుకొండ వెనక లేచేటందుకు బాధ పడతాడు. రాతిమీద నీ ఆకారాన్ని కొట్టలేక నే పడిన బాధ ఎవడికి తెలుసు?

*స్వరూ:* ఇంత చిత్రంగా మాట్లాడితే నాకేమీ అర్థం కావడం లేదు. కూర్చుని నీ గాథ విపులంగా చెప్పు శామా.

*శామ:* ఏం చెప్పను? నా చిన్నతనంలో నిన్ను చూసి ప్రపంచాన్ని బంగారు రంగులలో తడిపిన రోజుల్లో నేను గొర్రెల కాపరిని. నువ్వెక్కడికి పోయావో మళ్లా తెలీలేదు. ఆ నది వొడ్డున కూర్చుని నిన్ను గురించి ఊహించుకుంటూ, నీ ఆకారం జ్ఞప్తికి రాక మతిపోతుంటే, సూర్యుడు విసుగెత్తి అస్తమించేవాడు. తరువాత వీధులమ్మట పూసలు అమ్మేవాడిని. ఎవ్వరూ కొనేవారు కారు. కొంతకాలం కొండ మరుసయ్య సాయంవల్ల విలువిద్య అభ్యసించాను. ఇదంతా రెండు సంవత్సరాల క్రితం. అప్పుడు కృష్ణదేవరాయలు ఉదయగిరి ముట్టడి సంకల్పించి సైన్యాలకి చాటించాడు. అందులో చేరి నేనూ యుద్ధం చేశాను. నెలరోజుల్లోనే ఆ కోట మా వశమైంది. కాని ఆ దుర్గాధ్యక్షుడైన తిరుమల కాంతరాయనీ, అతని పినతండ్రి ప్రహరేశ్వర పాత్రునీ చెఱపట్టడం కాకుండా, అతని మేనత్తను కూడా చెరపట్టాడు రాయలు. నాకు చాలా కష్టం తోచి ఆమెని విడిపిద్దామని ఎన్నో యత్నాలు చేస్తే అది కొందరికి తెలిసి నన్ను సైన్యంలోంచి తొలగించారు. ఈ భవనాల్లో ఆమె ఎక్కడో వుందని నాకు తెలుసు. ఆనాటి నుంచి యీ భవనాల చుట్టూ తిరుగుతూ సమయం కోసం కాచివున్నాను.

*స్వరూ:* ఆమెను విడిపించడంలో నీకెందుకింత పట్టుదల?

*శామ:* ఆమె సుశీల; చాలా అందమైనది. అందమైన యేవొస్తువు ఖైదులో వున్నా నా ప్రాణం జిల్లాల్లుకుపోతుంది. సూర్యచంద్రాదులనూ. గాలినీ, సముద్ర కెరటాలనీ ఎవరు బంధించగలరు? వాటి నేనా అందరూ సమంగా అనుభవించేటట్టు చెయ్యడం దేవుడు చేసిన వొక మంచికార్యం. సరే, చెప్పనీ – అల్లా కావలా వేస్తూ వున్నప్పుడు, వొకరోజున నిన్ను చూడగలిగాను. జుట్టు ఆరబోసుకుంటూ పడమటి ఆకాశంలోకి చూస్తూ 13 సార్లు పచార్లు చేశావు. ఆ బుజాలు, ఆ నడుం, ఆ నల్లని జుట్టు ఎట్లా మరిచిపోను? సాహసం చేసి నిన్ను తీసుకుపోదామనుకున్నా, వీలుపడింది కాదు.

*స్వరూ:* వాంఛ లేని నీకు నేనెందుకు?

*శామ:* ఏదో పిచ్చి! నిద్ర రాదు. తోచదు. నాకు యిల్లూ వాకిలీ లేదు. ఎవ్వరూ స్నేహితులూ లేరు. ఈ సంఘం నువ్వు నా దగ్గర వుంటే నన్నూ వొక వ్యక్తిగా గుర్తించును. నా వ్యక్తిత్వం సాధించడం ఎట్లా? మనిద్దరి జీవితాలూ వొక నక్షత్రానికి సంబంధించడం ఎట్లా – అని హజారి రామాలయంలో కూర్చుని ఆలోచించేవాడిని. నా పేరు మార్చుకుని, క్రిస్టోవిడి ఫిగరీడో అనే దొరగారి అనుమతి పొంది విజయసౌధ నిర్మాతలలో వొకడుగా తీసుకోబడ్డాను.

*స్వరూ:* మా చిట్టి చెప్పింది. అక్కడ రెండు స్త్రీ విగ్రహాలు అచ్చంగా నాలా వున్నాయని.

*శామ:* అవి నే చెక్కినవే. ఇంక నాకేం కావాలి? మూడు ఆలయాలలో నీ ప్రతిమలు చెక్కి నా బాధ నుంచి విముక్తి పొందాను. ఇంక యీ లోకంలో నే చెయ్యగల పని లేదు. నువ్వు నాకు లభించనూ లభించవు. అంచేత లోకంపై వొక తృణీకరణభావం బైలుదేరింది. విఠోబాలయ నిర్మాతలలో వొకడుగా మళ్లా చేరాను. ఒక స్తంభంపైన నీ బొమ్మ చెక్కి నీ మూర్తికీ, దానికి వున్న పోలికలని తెలుసుకుందామని సాహసం చేత నిన్ను చూడాలని నిశ్చయించుకున్నాను. ఆ సమయం యివాళ చిక్కింది. గ్రహణ స్నానానికి అందరు స్త్రీలూ వెళ్లారు. నువ్విక్కడ వుండితీరతావని కనుక్కొని యీ బాణం వేశాను.

*స్వరూ:* అవి నా ప్రతిమలని రాయలు తెలుసుకుంటే?

*శామ:* అంత అందమైన స్త్రీ తనదే కదా అనుకుని గర్విస్తాడు.

*స్వరూ:* శామా, నువ్వింక వెళ్ళిపోవడం మంచిది. ఈ విషయం రాయలకి తెలిస్తే మన ప్రాణాలు దక్కవు. నే వెళ్లగొట్టబడ్డానంటే నా తల్లిదండ్రులు నన్ను వాళ్ల దగ్గరికి రానివ్వరు. నా బ్రతుకేమౌతుంది? నా మనస్సు నాకు తెలీకుండా నీమీదికి పోతూనే వుంది. కాని ఏం చెయ్యను? ఈ జీవితం నాకు తమాషాగానే వుంది. అదృష్టవశాత్తు, నేను సహగమనం చెయ్యాలన్న నియమం లేదు. ఎప్పుడో రాయలు నా దగ్గరకొస్తాడన్న ఆశా వుంది. నగలు, దుస్తులు, హోదా, ఠీవి, తోటి స్త్రీలతో అసూయలు, కొట్లాటలు – నా శామా, నేనూ వొకే ప్రపంచంలో వున్నాం కదా అన్న సంతోషం.


*శామ:* రూపం, నువ్వు నాకుమల్లే తెగించి, యివన్నీ వొదులుకుని వొచ్చేస్తావని నేను కలలో కూడా అనుకోలేదు. నిన్ను కోరిన పురుషులు యీ నగరంలోనే బోలెడుమంది వుండొచ్చు. కాని వాళ్లు నాకుమల్లే వారి గౌరవాలనూ, ప్రాణాలనూ త్యాగం చెయ్యడానికి సిద్ధంగా వుండలేదు. నేను నిన్ను కోరి సఫలీకృతం చేసుకోవడంలో నా మృత్యువు వుందని నాకు తెలుసు. సంతోషం, సత్యం, సౌందర్యం, ప్రేమా లేని నూరేండ్ల ముసలి వృథా బ్రతుకుకంటే వొక క్షణం మహత్తర ఆశాజ్వాలలో మండి బూడిదవడం వెయ్యిరెట్లు మేలని నా అనుభవం శాసిస్తూనే వుంది. నన్ను పొమ్మంటావు. ఎక్కడికి పోను?

*స్వరూ:* ఇంకా శిలలపై బొమ్మలు చెక్కుతూ వుండు.

*శామ:* నా సృష్టిశక్తులన్నీ ప్రజ్వలించుకుని నీ ప్రతిమలో కూర్చి, నేనూ శిలగా మారిపొయ్యాను. ఇంక నే జీవించి ప్రయోజనం? ఏమీ చేతకాక, కలలు లేక, సంతోషం, ప్రేమా లేక, ముసలివాడనై యవ్వనాన్ని చూసి అసూయపడుతూ, శరీరంలోంచి బైటికొచ్చిన ఎముకల్ని లెక్కెడుతూ, గతించిన విషయం కూడా లోకానికి తెలియకుండా –

*స్వరూ:* అబ్బ! ఆపు శామా – నా ఊహకి అవన్నీ స్ఫురింపచెయ్యకు. మనం జీవితాన్ని అంగీకరించాలి. ఈ ప్రేమని, బాధని దిగమ్రింగుకుని.

*శామ:* నీతులు నేర్పకు రూపం. ఒక సంగతి యథార్థమని నమ్మి దాని కనుగుణ్యంగా ప్రవర్తించకపోవడం మృత్యువు చిహ్నం. ఏనాడూ యథార్థ



నమ్మకాలకీ, దృఢనిశ్చయాలకీ, కార్యానికీ సమన్వయత్వం కుదరకుండా కపటజీవితం కౌగిలించుకుంటామో, ఆనాడు యీ సామ్రాజ్యం కూలి రాళ్లగుట్టలుగా మారుతుంది. శరీరాలు, హృదయాలు, రాజ్యాలు – అన్నీ నశించు. నా రక్తంతో నా హృదయంలో నాళాలని ఆయుధాల కింద మార్చి రాళ్ల మీద చెక్కిన సత్యమూర్తి శాశ్వతంగా వుంటే వుండొచ్చు.

**స్వరూ:** ఇదంతా ఆకలితో వున్న సింహం చేసే గర్జన. ఆకలి తీరిన తర్వాత ఎంత హాస్యాస్పదంగా వుంటుందో తెలుసా సింహం? నేనూ నిన్ను గురించి అనుకుంటూ వుంటా. ఊహలో వున్నప్పుడే నువ్వు శాశ్వతంగా, యథార్థంగా వుంటావు. దాన్ని భ్రమగా మార్చి వెక్కిరించడం నాకిష్టంలేదు. ఇంతకుముందే చిట్టితో చెప్పేశాను, మనిద్దరికీ జరిగిన మూగస్నేహం. దాన్ని చెప్పేవరకూ నాలో ఎంతో ఆరాటం. చెప్పేసింతర్వాత కూడా అది స్వప్నంలో చరిత్రలాగుంది.

**షామ:** సత్యం బైటపడాలని ఎంతో బాధపడుతుంది. దాని ఘోష వినిపించుకోకుండా త్రోసిపుచ్చి, నన్ను భ్రమగా నీ ఊహలో బంధించడం మహాపాపం. నువ్వు యీ భవనంలో బంధింపబడ్డావు? నేను నీ ఊహలో బంధింపబడ్డాను! సత్యాన్ని ఎంతకాలం దాస్తావు రూపం? పూర్తిగా సత్యాన్ని దాచడంలో నెగ్గినప్పుడు ఈ సామ్రాజ్యం కూలి రాళ్లకుప్పలౌతుంది.

**స్వరూ:** ఈ దీవెనలు ఎంతవరకూ నిజమో నీకూ నాకూ తెలీదు. ఉన్న వస్తువుని వున్నపళంగా స్వీకరించడం నేర్చుకో షామా. నన్ను – నా వాతావరణాన్ని అల్లానే అంగీకరించాలి. నన్ను మార్చడం, మరో వాతావరణంలోకి లాక్కుపోవడం మూఢత్వం అంటాను. సూర్యుణ్ణి తూర్పుకొండ వెనక నుంచి కాకుండా మరోచోట ఉదయించేటట్టు చెయ్యగలవా, చెప్పు.

**షామ:** కార్యశూరత్వం లేని వ్యక్తులకి వేదాంతం ఆయుధంలా తోస్తుంది. బలహీనులు బలవంతులను చూసి ఓర్వలేక భౌతికబలం చెడ్డదని నీతి సిద్ధాంతాలు నెలకొల్పుతారు. బీదవాళ్లు భాగ్యం నరకానికి దారి తీస్తుందని వేదాంతం బోధిస్తారు. చెడిపోవడానికి అవకాశాలూ, తెగింపూ లేని వ్యక్తులు చంచల ప్రేమని దూషిస్తారు. ఆఖరికి వారకాంతలు కూడా వాళ్లల్లో ఎవతైనా నిజంగా ప్రేమించి, సంసారిగా మారిందంటే దాన్ని హింసించి వెలేస్తారు. ప్రత్యేకమైన సంస్థలు ప్రతిపాదించిన నియమాలకే నీతని పేరు. నేనొక సంస్థకి చెందను. సంఘంలో నాకు స్థిరపడ్డ స్థానం లేదు. అందుకని వీటిని ఆమోదించను.

**స్వరూ:** అల్లా ఆమోదించకుండా, అరాజకంగా జీవించడం కూడా నీ నీతే. నీలాటివాళ్లు వంద మంది వుంటే మీరంతా కలిసి మీ నీతిని సాటిస్తారు. దానికి వ్యతిరేకంగా ప్రవర్తించినవాణ్ణి మీరు నిందిస్తారు. అంతేనా?

**షామ:** స్వరూ, నీకు హృదయం, దయ, ప్రేమా, స్వచ్ఛమైన ఆనందం లేవు. రాళ్లమాదిరి పదునుగల కాఠిన్యమైన తర్కం, బుద్ధీ వున్నాయి. అంతే, నేను హృదయంతో ఆలోచిస్తా – బుర్రతో కాదు. ఆత్మతో వాదిస్తా – నాలుకతో కాదు. నీకీరెండూ లేవంటే నిరాశ పుడుతోంది. నన్ను అర్థం చేసుకోవాలి. వాదించి, నెగ్గి, తోసెయ్యకూడదు. నన్ను సంపూర్ణంగా అంగీకరించాలి. జీవితాన్ని అంగీకరించాలని నువ్వు చెప్పిన నీతేగా.

**స్వరూ:** నాకు నిన్ను చూస్తే జాలిగా ఉంది షామా. నా ప్రపంచాన్ని వొక్షణంలో పునాదులతో సహా పెల్లగించాలని యత్నిస్తున్నావు. నా నాశనానికి నువ్వే హేతువులాగున్నావు. నా ఊహలో నది వొడ్డున కూర్చుని నాకేసి చూస్తున్న షామరాజు నిజమైన వ్యక్తి. అతన్ని అంగీకరిస్తున్నాను. నా శరీరాన్ని వాంఛించి, ప్రాణాలకే తెగించిన నువ్వు పరపురుషుడవు. నిన్నెట్లా అంగీకరించను?

**షామ:** నీ మనస్సు – నిశ్చయం – నాకు బోధపడింది రూపం, నేనింక బ్రతికేది కొన్ని నిముషాలు.

**స్వరూ:** నువ్వు యిప్పుడు వెళ్ళి, మరోసారి ఎప్పుడేనా రాకూడదా?

**షామ:** అట్లాంటి పిరికిపని, దౌర్భాగ్యపు పని చెయ్యమనడానికి నీకు నోరెట్లా వొచ్చింది స్వరూపిణీ? నేను ముందుకి సాగిపోవలసిందే కాని – వెనక్కి మళ్లడం లేదు నాకు. ఏదో దాక్కుంటూ, రహస్యంగా, దొంగవేషంతో వొచ్చి, కాసేపు నిన్ను చూసి, అలభ్యమని తెలుసుకొని బాధపడుతూ, కుటిల ప్రేమతో, నీచ మనస్సుతో బ్రతకమంటావా? అది అసంభవం స్వరూ. నువ్వు నాతో ప్రయాణం చెయ్యలేవు. ఇది కత్తిమీద సాము. దాని మీదే నా నశింపు. నువ్వు నీ ఊహలో బ్రతుకుతూ, పాతివ్రత్యం నటిస్తూ, వృద్ధురాలవై, సంతానం లేక, యీ సామ్రాజ్యంతోపాటు నశించి, మరిచిపోబడి రాళ్లగుట్టగామారతావు. కాని – రూపం! (ముందుకి వెళ్లి) నీకు నా శిల్పాల ద్వారా అమరత గడించిపెట్టానని నమ్ము. నా వ్యక్తిత్వానికీ, ప్రేమకీ అవే బహిర్గత చిహ్నాలు. మనం అనామకులం. కాని నాలోని యథార్థం, ఆ జ్వాలా, సృష్టి సౌందర్యం – అన్నీ ఆ ప్రతిమలు శాశ్వతంగా సాటిస్తూనే వుంటాయి.

(కిటికీలోకి చూసి) చంద్రుడు పైకి సాగిపోతున్నాడు. సోమరిగా మేఘాలు అతని పవిత్రతను కలవరపెడుతున్నాయి. నా హృదయం దాటి మరుగులోకి పోతోంది. స్వరూ, ఒక్కసారి నువ్వు – నీ



## సావిత్రికి దక్కని ఫలం

మూగమనసులు సినిమాను సావిత్రి తమిళంలో ప్రాప్తం పేరిట స్వంతగా తీసింది. తనే దర్శకత్వం కూడా చేసింది. కానీ ఆ సినిమా ఘోరపరాజయం పాలైంది. అక్కడ శివాజీ, సావిత్రి, చంద్రకళ వేశారు. నిజానికి తమిళంలో కూడా జమునే చేయాలిసివుంది. కానీ ఆవిడప్పుడు వంశీని కడుపుతో వుంది. అంచేత వీలుకాకపోయింది. తెలుగులో ఇంతగా అలరించిన ఈ సినిమా తమిళంలో పరాజయం పాలుకావడానికి కారణం నిజంగా సావిత్రి దురదృష్టమేనని పిస్తుంది. కావేరి నది నేపథ్యంగా అక్కడ కథను మలుచుకున్నారు. కావేరి పరీవాహక ప్రాంతాల్లో షూటింగు చేశారు. మన రాజమండ్రికి వచ్చి కొంత ఇక్కడ గోదావరి వొడ్డున కూడా తీశారు. సినిమా ఆరంభించిన నాటికి శివాజీ మంచి ఫామ్‌లో వున్నారు. సావిత్రి మాత్రం ఆర్థికంగా అప్పటికే చిక్కుల్లో వుంది. మొదటి షెడ్యూలు పూర్తికాగానే సినిమాకు బయ్యర్లనుంచి మంచి ఆఫర్లు వచ్చాయి. కానీ సినిమామీద నమ్మకంతో సావిత్రి అమ్మలేదు. ఆ తరువాత షెడ్యూళ్లు పూర్తి చెయ్యడానికి ఆవిడకు ఫైనాన్స్ ఇబ్బంది అయింది. దానితో సినిమా పూర్తి కావడానికి చాలా కాలం పట్టింది. ఈలోగా ఆవిడ దురదృష్టం శివాజీ సినిమాలు వరుసగా మూడు దెబ్బతిన్నాయి. దాంతో బయ్యర్లు జారిపోయారు. చివరికి నానాకష్టాలుపడి సినిమాను పూర్తిచేసి సావిత్రే స్వంతగా విడుదల చేసుకుంది. సినిమా ఘోర పరాజయం పాలైంది. తమిళంలో పెద్ద లోపం సంగీత సాహిత్యాలు పండకపోవడం. ప్రాప్తం సినిమా సావిత్రి జీవితాన్ని అతలాకుతలం చేసింది. లంకంత ఇంటిని ఆవిడకు లేకుండా చేసింది. ఆ తరువాత ఎవరైనా ఈ విషయం కదిపినపుడు ఆవిడ వేదాంతిలా నవ్వేది. 'ఏం చేస్తావండీ! మనకు ఇంతే ప్రాప్తం' అనేది.

శరీరం మరిచి - తన్మయతతో నాట్యం చేస్తుంటే చూడాలని వుంది. అదీ నా కడసారి కోరిక.

(స్వరూపిణి పైన కప్పుకొన్న కండువా తొలగించి అతని ముందు నాట్యం మొదలెడుతుంది. అతను ద్రాక్షపళ్లు తింటూ చూస్తూ కూర్చుంటాడు. పది నిముషాలు కాగానే అతను లేస్తాడు)

షామ: ఎలకపిల్ల మాదిరి లంగాలోంచి బైటికి తొంగి చూస్తూ గంతులేసే నీ పాదాలు, కళ్లు ప్రారంభించిన చిరునవ్వును పూర్తిచేసే నీ పెదవులు...

(ఆమె చేతులు పైకెత్తి వుంచిన భంగిమలో అతని ముందు నిలబడుతుంది. అతను ఎడమచేత్తో ఆమె చేతిని పట్టుకుని, రెండోదానితో ఆమె ముఖాన్ని తన ప్రక్కకి తిప్పుకుంటాడు. తటాలున గిలిగింతలు పెట్టి పరుగెడుతుంది. అతను వెనకా, ఆమె ముందూ - గది చుట్టూ నాలుగైదుసార్లు నవ్వుకుంటూ పరుగెత్తుతారు. చిట్టి 'అయ్యో', 'అమ్మో' అనుకుంటూ, నోరూ గుండెలూ బాదుకుంటూ ప్రవేశిస్తుంది.)

స్వరూ: ఏమొచ్చిందే?

చిట్టి: ఇంకేముంది? కొంప మునిగింది! గంటలు మ్రోగినాయి. మహారాజు యిక్కడికే వొస్తున్నాడమ్మా.

స్వరూ: నిజంగా? మన గదికే? ఆయనతో కూడా యింకెవరేనా వున్నారా?

చిట్టి: ఆ. చాలామందున్నారు. ఇక్కడికే... ఎట్లా? (అటూ యిటూ చూస్తూ గంతులేస్తుంది.)

ఆమె చేతులు పైకెత్తి వుంచిన భంగిమలో అతని ముందు నిలబడుతుంది. అతను ఎడమచేత్తో ఆమె చేతిని పట్టుకుని, రెండోదానితో ఆమె ముఖాన్ని తన ప్రక్కకి తిప్పుకుంటాడు. తటాలున గిలిగింతలు పెట్టి పరుగెడుతుంది.

స్వరూ: (కండువా కప్పుకుని, బట్టలు సర్ది) షామా, నువ్వు పారిపో, పరిగెత్తు.

(అతను తల పంకిస్తాడు)

షామ: నిన్ను చూసి విప్పుకున్న కళ్లని మళ్లా యీ పాడులోకంమీద యెట్లా వాల్చను?

స్వరూ: ఇప్పుడిట్లాంటి మాటలొద్దు. పద, ఎక్కడో దాక్కో.

షామ: ప్రాణాల మీద ఆశపడే పిరికిపందని కాను.

స్వరూ: నా మానం, నా గౌరవం... (ఆలోచించి చిటికవేసి) లేకపోతే విషం తాగాలి.

షామ: సిద్ధంగా వున్నాను.

చిట్టి: వీడు చచ్చినా బ్రతికినా మనకు ముప్పు తప్పేటట్లు లేదు. శవాన్ని ఏం చేద్దాం?

షామ: శెలవు తీసుకుంటా నా చిన్ని శెలయేరూ. (కలశం తీసుకుంటాడు)

స్వరూ: నువ్విక్కడే వుండి విషం తాగించు. షామా, ఈ లోకంలో లేని స్వేచ్ఛ మరో లోకంలో, నిన్ను మరచిపోను.

(వెడుతుంది గది బైటకి. శ్రీకృష్ణదేవరాయలు తొందరగా ప్రవేశిస్తాడు. అతను సామాన్యమైన యెత్తు; మంచి ముఖవర్చస్సు; దృఢకాయం; ముఖాన అక్కడక్కడ స్ఫోటకపు మచ్చలు. కాని అవి వికారం కలిగించవు. పాగా - అందులో యీక. శాలువా కప్పుకుంటాడు. వంకర తిరిగిన మీసాలు. అతన్ని చూడగానే పూజ్యభావం ఉదయిస్తుంది.)

(* ఇది న్యూజెస్, పేయిస్‌ల వర్ణనలని అనుసరించి.)

కృష్ణ: (చప్పట్లు కొడుతూ) స్వరూపిణీ,... సరే బాగుంది, నువ్వే వొచ్చావు. నదీ సాన్నానికి వెళ్లక యింకా యిక్కడే వున్నావేం? లే, లే, మనకోసం బైట చాలామంది కాచుకున్నారు.

స్వరూ: (జుట్టంతా చిందరవందరగా వుంటుంది. ఆయాసం - మాట తడబడుతుంది) నామీద నేటి కాలానికి ఎంత దయ! (నమస్కరిస్తుంది).

కృష్ణ: ఇప్పుడు విఠోబాలయాన్నించి వస్తున్నా. అందులో వొక స్తంభంపైన నీమాదిరిగా వున్న చిత్రాలు చెక్కబడి వున్నాయి. నాకు తట్టలేదు. తెనాలి రాముడు ఆ పోలికని చూపించాడు. కాదన్నాను. నాతో పందెం వేశా. ఇప్పుడక్కడికి నాతో




రావాలి, పద, పద...

స్వరూ: (ఆశ్చర్యం నటించి) నిజంగా? ఐనా, నే ఎల్లా వుంటానో మీకెట్లా తెలుస్తుందిలెండి? నన్నె ప్పుడేనా చూస్తేగా?

కృష్ణ: సరసాలకి సమయం యిదా స్వరూ? క్షణం చూసినా ఏడాది చూసినా మనస్సు మీద ఒత్తిడి కలిగించే శక్తి నీలో వుంది. అదీ తెలియనంతటి శృంగార రహితుడ ననుకోకు.

స్వరూ: సరే - పదండి - వొస్తున్నా.

కృష్ణ: ఏమిటి, యిట్లాగే? ఎవరేనా నవ్వుతారు. నీ ఆభరణాలేవీ? బంగారు జడేదీ? జ్వాలలా మెరిసే నీ ఎఱ్ఱటి బొట్టేదీ? నీ రత్నాల హారమేదీ? జరీ...

స్వరూ: ఆలయానికెడుతూ అవన్నీ ఎందుకు లెండి.. పదండి.

కృష్ణ: అహహ. అల్లా కాదు. నీతో వుండి, నిన్ను చూసే అవకాశాలే తక్కువ. అప్పుడేనా నాకు నీ నిజస్వరూపం చూపించవా? గదిలోకి పద - నే సర్దుతాను నీ జడ, నీ ఓణీ, నీ బంగరు కడియాలు -

స్వరూ: ఒద్దువొద్దు - ఇట్లాగే పోదాం.

(రాయలు ఆమె చెయ్యి పట్టుకుని బలవంతంగా తీసుకెడతాడు. ఆమె పెనుగులాడుతుంది. బుగ్గమీద కొట్టి నవ్వుతూ లాక్కుపోతాడు.

గదంతా చిందరవందరగా వుంటుంది. ఒక మూల షామరాజు బోర్లాపడి వుంటాడు. వెన్ను, జుట్టు మాత్రం కనిపిస్తూ వుంటుంది. నడుందాకా తెల్లటి బట్ట కప్పబడి వుంటుంది. దగ్గర్లోనే కలశం వొంకరగా పడివుంటుంది. కృష్ణరాయలూ, స్వరూపిణీ ప్రవేశించేటప్పటికి చిట్టి వీణని ఎత్తి బల్లమీద పెట్టి సోఫా సర్దుతుంది. వాళ్లని చూసి సాష్టాంగ ప్రమాణం చేస్తుంది)

కృష్ణ: రామలింగడెప్పుడూ యిట్లాంటి పందాలే వేస్తుంటాడు. మొండిమనిషి! ఎవడికీ తట్టని భావాలు అతడికి తట్టుతుంటాయి. అసలు నిన్నెప్పుడు చూశాడు? ఓహో! శివరాత్రి నాడు నాట్యం చేసినప్పుడు కాబోలు... (ఎదురుగా చూసి) అదెవరు? మనిషిలా వుందే.... మనిషే. మొగాడు. ఎవడు వీడు?

స్వరూ: మనిషి.

కృష్ణ: (కాలు నేలని కొట్టి) ఎల్లా వొచ్చాడిక్కడికి?

స్వరూ: వాడు వొక నేరస్థుడు లెండి.

కృష్ణ: చాలా చిత్రంగా వుంది. తొందరగా చెప్పు.

స్వరూ: అబ్బ. ఉండండి. ఇవాళ ఫెరిస్టాఖాన్ కొన్ని పరిమళాలంపాడు. నాకెప్పుడూ పంపుతుంటాడులెండి. మంచి మంచి అత్తరులు. వాటితోపాటు, బాధలేకుండా సునాయాసంగా చంపే విషం కూడా పంపించాడు. అదెంతవరకూ నిజమో పరీక్షిద్దామని యీ ఖయిదీని తెప్పించి తాగమన్నాను. మంచి విషం. చప్పుడు చెయ్యకుండా ప్రాణం విడిచాడు.

కృష్ణ: అయ్యో పాపం, వీడిమీదెందుకు ప్రయోగించావు? బోలెడుమంది శత్రువులు నీకూ, శత్రురాజులు నాకూ వున్నారుగా - ఆకులకి సున్నం రాయి, తొందరగా తెమలాలి.

(స్వరూపిణి మొహాన్ని చేతుల్లో దాచుకుంటుంది.)

ఏమిటిది? చచ్చినవాడికోసం జాలిపడి ప్రయోజనం లేదు. నేరస్థుడు - అందులో రోగిలా వున్నాడు.

స్వరూ: రోగి కాడు. ఎంతో బలంగా వున్నాడు. (ఏడుపు సాగిస్తుంది)

కృష్ణ: అయ్యో పాపం! లే, మా చిట్టికా... పోతే పొయ్యాడులే. ఎవళ్లతో చెప్పద్దు. ఏం? (బుజ్జగిస్తాడు)

స్వరూ: (బిగ్గరగా) అతను... అతను నేరస్థుడు కాడు. మామూలు మనిషి.

కృష్ణ: (కాలు నేలకి కొట్టి, పాగా తీసి) ఏమిటీ వేషం –నా కర్థం కావడం లేదు. ఎవడు వాడు?

స్వరూ: అతను నా స్నేహితుడు...

కృష్ణ: ఐతే?

స్వరూ: నిష్కారణంగా చంపేశా. నాకోసం వొచ్చాడు. చంపేశా... యీ చేతులతో...

కృష్ణ: ఎందుకు?

స్వరూ: మీరొస్తున్నారని తెలిసింది. వెళ్లమంటే వెళ్లాడు కాదు. విషం తాగాడు.

కృష్ణ: పాపం, పిచ్చివాడు. నేనేదో చేస్తాననుకున్నాడు (కోపంగా) నీతో ఏం పని?




స్వరూ: నన్ను కోరాడు – ప్రేమించాడు. నేను వీల్లేదన్నాను. చంపేశాను.

కృష్ణ: పిచ్చివాడు! నాతో చెబితే నిన్ను అతని వెంట పంపి వుందునుగా. నీది కఠిన హృదయం.

స్వరూ: మీదీ అంతే. ఇన్ని సంవత్సరాల నుంచి నన్నిక్కడ బంధించారు. దాస్యమే స్వర్గమనుకున్నాను. మీకు హృదయం లేదు.

కృష్ణ: వెర్రిపిల్లా, నీ సౌందర్యం అర్హతలేని శుంఠలు అనుభవించి నశింపుకాకుండా నేను భద్రంగా కాపాడాను. ప్రేమించినందుకు నువ్వు చేసిన ప్రతిఫలం వాణ్ణి చంపడం. ఎవరికి లేదు హృదయం?

స్వరూ: అతనెల్లానూ చచ్చాడు కాబట్టి అల్లా అంటున్నారు. బ్రతికి వుంటే ఎంత అల్లరిపెట్టి హింసిద్దురో? శత్రురాజుల స్త్రీలని చెరబట్టి హింసించిన మీరు నా రాజుని దయతో కౌగిలించుకుందురా?

కృష్ణ: (నవ్వుతాడు) నా దయ నీమీద కాదు. అతనిమీద. నీ తాత్కాలిక ప్రేమకోసం ప్రాణం త్యాగం చేసిన యీ వ్యక్తి మహత్తర వ్యక్తి అయివుండాలి.

స్వరూ: అంతా హేళన, వెక్కిరింపు. మీరు, మీ సంగతి? ఎవరికి పుట్టారు మీరు? మీ తల్లి? మీ తండ్రి నరసరాయలు ఆ దాసీదీ – కులకాంతా ఐన నాగాంబికతో కలియడం వల్ల కదా మీరు పుట్టింది?

కృష్ణ: (లేచి కోపంతో పులిలా తిరుగుతూ) ఛీ,

అంతా హేళన, వెక్కిరింపు. మీరు, మీ సంగతి? ఎవరికి పుట్టారు మీరు? మీ తల్లి? మీ తండ్రి నరస రాయలు ఆ దాసీదీ – కులకాంతా ఐన నాగాంబికతో కలియడం వల్ల కదా మీరు పుట్టింది?

ఛీ! నోరు ముయ్యి. నీ నీచపు బ్రతుకుని అందరు స్త్రీలకి ఆపాదించకు. మా తల్లి వారకాంత అని ఎవరో నేనంటే గిట్టనివాళ్లూ, నన్ను సింహాసనాన్నుంచి తొలగించాలన్నవాళ్లూ వేసిన పుకారు. మా తల్లి సాగివారి ఆడపడుచు. దాసీది కాదు; క్షత్రియ స్త్రీ. ఒకసారి చదరంగం ఆటలో దాసీగా వోడిపోవడం మూలాన అట్లా పరిహాసంగా అనేవారు. నిన్నేం చేస్తానో చూడు. (మొహాన్ని గీరబోయి వెనక్కి తగ్గుతాడు)

(నిశ్శబ్దం)

ఈ స్నేహం గురించి నాతో ఎందుకు చెప్పలేదు? అప్పుడే వాణ్ణి రప్పించి, వాడితో పంపుదును కదా.

స్వరూ: ఆ, పంపుతారు! అసలు మీకింతమంది స్త్రీలెందుకు?

కృష్ణ: అసందర్భపు ప్రేలాపనలకి దండన మృత్యువు... (కొంచెం తమాయించి) ఏదో అల్లా చిరాకుపుడుతూంటుంది. రాజుకి సంప్రదాయాన్ననుసరించి కొందరు స్త్రీలు, భార్యలు అవసరం. నా హోదానీ, ఠీవినీ వారు సాటుతారు. లేకపోతే యింతమంది మహా పతివ్రతలనుకునే మూఢుణ్ణి అనుకున్నావా? ఈ జనానాలో నిర్బంధం లేదు. ఇష్టం లేనివాళ్ళు తక్షణం వెళ్ళిపోవచ్చు. నగలనీ, దుస్తులనీ, దర్జానీ ఆశించి వచ్చినవాళ్ళలో నువ్వొకదానవు. నీకు పతిభక్తీ, పవిత్రప్రేమా వున్నాయని ఎవ్వరూ నమ్మరు. నువ్విప్పుడు చేసిన ఘోరపాపం నీకు హృదయం కూడా లేదని చాటుతోంది.

స్వరూ: నన్నిట్లా బాధించకండి. నాకిప్పటికి కాని అతని ప్రేమలో వున్న లోతు అర్థం కాలేదు. నేను బ్రతకను, నా ప్రతిమల్ని స్తంభాలపై చెక్కింది యితనే.

కృష్ణ: నిజంగా? ఇతనొక గొప్ప శిల్పి. ఇతని కళని నీ అందం బలికోరింది. నీకు అమరత గణించిపెట్టాడు – విలువ లేని నీకు...

స్వరూ: అతను నన్ను నిజంగా వాంఛించలేదు. నన్ను నమ్మండి – ఏమీ చెయ్యలేదు.

కృష్ణ: రూపం, నీ వెర్రికి జాలేస్తోంది. వాంఛంటే నాకు తెలుసు. అనేక మధువులు త్రాగాను. చివరిది మొదటిదానిలాగే వుంది. దాహానికంటే మధురమైన పానీయం లేదు. అనేక ఫలాలనీ, రుచులనీ చవిచూశాను. అన్నీ ఒకలాగే వున్నాయి. ఆకలికంటె మధురమైన తినుబండం లేదు. ఆ మధువునీ, ఆ ఫలాలనీ పశువులకు పెట్టు. నేను నా దాహం


కేంద్రప్రభుత్వరంగ సంస్థ ఆధ్వర్యంలో

ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీ కల్చర్ & కాస్మొటాలజీ కోర్సులలో శిక్షణ

NATIONAL CENTRE FOR FASHION TECHNOLOGY

INDIAN CENTRE FOR BEAUTY CULTURE

(ISO 9001 Certified Instiutions in association with GOVT. OF INDIA Org.)



కేంద్రప్రభుత్వరంగ సంస్థ ఆధ్వర్యములో నేషనల్ సెంటర్ ఫర్ ఫ్యాషన్ టెక్నాలజీ ఇండియన్ సెంటర్ ఫర్ బ్యూటీకల్చర్ సంయుక్తంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా పట్టణాలలో ఆమోదిత శిక్షణ కేంద్రాల ద్వారా నిర్వహించు ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీకల్చర్ & కాస్మొటాలజీ కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులు కోరబడుచున్నవి. **కోర్సులు :** డిప్లొమా ఇన్ ఫ్యాషన్ డిజైనింగ్, పి.జి. డిప్లొమా ఇన్ ఫ్యాషన్ డిజైనింగ్, మాస్టర్ డిప్లొమా ఇన్ ఫ్యాషన్ డిజైనింగ్, డిప్లొమా ఇన్ బ్యూటీకల్చర్, డిప్లొమా ఇన్ బ్యూటీకల్చర్ & కాస్మొటాలజీ. టెన్త్‌పాస్, ఇంటర్, డిగ్రీ చేసిన, చేస్తున్న వారు, దరఖాస్తు చేసుకోవచ్చు. శిక్షణ అనంతరం సెంట్రల్ గవర్నమెంట్ సంస్థ ఆమోదిత సర్టిఫికెట్ జారీచేస్తారు. ఎస్.సి., ఎస్.టి., బి.సి.లకు, రిజర్వేషన్‌తో పాటు 25% ఫీజు తగ్గింపు కలదు. ఆసక్తి గలవారు తెల్లకాగితంపై పేరు, తండ్రిపేరు, విద్యార్హత, కులము, వార్షిక ఆదాయము, ఆసక్తి గల కోర్సు, చిరునామా వ్రాసి సంతకం చేసి ఐదు రూపాయల స్టాంపుగల స్వంత చిరునామా గల కవరును జతచేసి ఈ ప్రకటన వెలువడిన 15 రోజుల లోపు దిగువ చిరునామాకు పోస్ట్ లేదా కొరియర్ ద్వారా పంపవలెను.

దరఖాస్తులు పంపవలసిన చిరునామా :

Programme Director :
NCFT/ICBC, Opp. 6 No. Bus Stop,
Shivam Road, Baghamberpet,
New Nallakunta, Hyderabad-13.
Ph : 040-27406825, 9391229111



GOVT. OF INDIA ORG. APPROVED CERTIFICATE WILL BE ISSUED.

ఫ్యాషన్ డిజైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్, బ్యూటీషియన్ ట్రైనింగ్ సెంటర్స్ & స్టడీ సెంటర్స్ ద్వారా శిక్షణ ఇచ్చుటకు సంప్రదించండి. ఫోన్: 9391229111

తోనూ, నా ఆకలితోనూ నీరసంగా పరుండి మోక్షం పొందుతా. నీకు పూర్తి స్వాతంత్ర్యం ఇచ్చాను. నీ యిష్టం! యిక్కడుండొచ్చు. వెళ్ళొచ్చు. నేను నమలి పారేసిన ఫలాలను ఏరుకు తినొచ్చు.

స్వరూ: ఎక్కడికి పోనూ? నాకు షామా కూడా దూరమయ్యాడు.

కృష్ణ: నీకతడు జీవించి వుండగానే దూరమయ్యాడన్న సంగతి తెలుసుకో. అతని ప్రతిభ ఆ శిల్పాలలో వుంది. భౌతిక దేహాన్ని నువ్వు నశింపచేశావు. అంతే. (లేస్తాడు. లోపల్నించి ఎవరో పిలుస్తారు)

ఇంక నే వెడతాను. అష్టదిగ్గజాలు మావటివాడి కోసం కాచుకుని వున్నారు. సేవకుని పంపుతాను. బైట పారెయ్యమను. (ఆలోచించి). ఆ మరిచాను. ఇది బంధిఖానా అంటూ ఏదో గొణిగావు మొదట్లో. నీకొక్కదానికే కాదు యీ సంకెళ్లు. మనందరినీ యీ ప్రపంచం బంధించింది. కిరీటం నన్ను, స్వార్థం నిన్ను, కళ అతన్ని, ఆకృతి రాళ్లనీ, చీకటి వెలుగునీ, సంస్థలు సంఘాన్నీ, ప్రేమ మానవ హృదయాన్నీ సంకెళ్లతో సాకుతాయి. ఇదుగో ఈ సంకెళ్లు చప్పుడు కాకుండా చూసే బాధ్యత మనదీ - బాధ్యత నాదీ... (ఎవరో రాజుని పిలుస్తారు) బాధ్యత... (గొణుగుతూ వెడతాడు) రామలింగడికి బహుమానం ఏమివ్వను? ఈ శిల్పికి స్మారకచిహ్నం... ఆలోచించాలి... (నిష్క్రమణ).

(విచారంతో వాలిపోయిన స్వరూపిణి మెల్లగా లేస్తుంది. చిట్టికోసం చప్పట్లు కొడుతుంది. లేచి బల్ల దగ్గరకెళ్ళి అందులోంచి విషం సీసా తీసుకొస్తుంది.)

స్వరూ: చిట్టీ, నువ్విందాకటినుంచీ యిక్కడే వున్నావా?

చిట్టి: కాసేపున్నా; కాసేపు లేను. కాదు కాదు; మొదట్లో లేను, చివరలో వున్నా.

స్వరూ: చిట్టీ, రాజుగారి మాటలు విన్నావా?

చిట్టి: భయమేసింది. దూరంగా పారిపోయా. విన్నా కాని విననట్టే లెక్క.

స్వరూ: నేనేం చెయ్యనే? విషం తాగాడే!

చిట్టి: కలశం నా చేతులోంచి లాక్కుని - పక్కకి తిరిగి 'మంట, మంట' అని అరిచాడు. గబ గబా పరిగెత్తాను. ఏం మంట, వాడి నెత్తి మంట! చూసేప్పటికి పడివున్నాడు. కావాల్సిందే.

స్వరూ: చచ్చిన వాడిని ఎందుకే దూషించడం? నోరు నొక్కుకో. (రెండు చేతులతో నోరు నొక్కుకుంటుంది). అతను బతికి వుంటే ఎంత బాగుండును?

చిట్టి: బ్రతికివుంటే పిచ్చివాగుడు (మళ్లా నోరు నొక్కుకుంటుంది)

స్వరూ: నేనీప్రపంచాన్ని ఎల్లా చూడగలనే?

చిట్టి: కళ్ళతో!

స్వరూ: నీకిప్పుడా పరిహాసం! ఛీ! అవతలికి పో (తోస్తుంది)

చిట్టి: లేకపోతే నేత్రాలతో...

స్వరూ: చిట్టీ, నే జీవించనే...

చిట్టి: అమ్మో - నేను జీవించను. నేను అసలు మొదలే చావను. కాదుకాదు - మొదలే చస్తాను.

స్వరూ: ఇక్కడినుంచి అవతలికి పో.

(గట్టిగా తోస్తుంది. అతని దగ్గరకెళ్ళి కూర్చుని వెన్నుమీద చెయ్యివేసి పక్కకి తిప్పుతుంది. ఆ కలశం తీసుకుని అందులో విషం పోస్తుంది. 'చిట్టీ, నే జీవించనే' అని త్రాగబోతుంది. షామరాజు చివాలున లేచి, ఆమె చేతిలోని కలశాన్ని లాక్కుంటాడు. స్వరూపిణి ఆశ్చర్యంతో కళ్లు పెద్దవిచేసి వెనక్కి తగ్గుతుంది. చిట్టి 'అమ్మో, దయ్యం దయ్యం' అంటూ అక్కడికొచ్చి గంతులేస్తుంది)

షామ: నే దయ్యాన్ని కాను నా సత్తుదీపం సెమ్మా.

చిట్టి: అమ్మో! నల్ల కొరివిదయ్యం.

స్వరూ: ఎవరో తలుపు తడుతున్నట్లుంది. వెళ్లి చూడు.

(చిట్టి వెడుతుంది)

షామా, ఎంత సాహసం?

షామ: నేను ప్రాణాల మీద ఎల్లానూ ఆశ వొదులుకున్నా. కాని, చూద్దాం ఏం జరుగుతుందోనని విషం పారబోసి - చిట్టికి తెలుసు - చచ్చినవాడి మల్లే పరున్నాను. రాయలకి ఎంత దయ? ఎంత ఆదరణ? మనం బైటికి పోదాం, పద. గ్రహణ స్నానం చేద్దాం. ఆమట్టున మావూరు.

స్వరూ: రాజుకి తెలిస్తే...?

షామ: మనని రప్పించి బాహాటంగా బహూకరిస్తాడు. పద పోదాం.


చిట్టి: మరి నా మాటో?

స్వరూ: నీకు సాయిబు.

చిట్టి: ఛీ, ఛీ!

షామ: కాదు. నువ్వూ మాతోనే వొస్తావ్ మా చిన్ని మిరపపండూ. (వెళ్ళబోతుంటే తెర తొందరగా జారుతుంది.)

## విప్లవ వాల్మీకి



**బా**పు-రమణలంటే ఆరుద్ర కు ప్రత్యేక అభిమానం. సంపూర్ణ రామాయణం సినిమా తీస్తున్నప్పుడు అంతా గేలిచేశారు. రచయిత ఆరుద్ర కమ్యూనిస్టు, నిర్మాణ వ్యవహర్త ముళ్ళపూడి హ్యూమరిస్టు, దర్శకుడు బాపు కార్టూనిస్టు, ఇహ ఈ సినిమా ఫ్లాపుల లిస్టే అని. కానీ ఆ సినిమాను జనం బ్రహ్మాండంగా ఆదరించారంటే అది ఆరుద్ర మహత్తే. వెడలెను కోదండపాణి వంటి సుదీర్ఘ కథా కథన గీతంతోపాటు, ఆ సినిమాకు ఆయన రాసిన అత్యంత సరళమైన మాటలు ప్రేక్షకులకు మధురమంజులంగా తోచాయి. శ్రీరామచంద్రుని మహిమను వర్ణిస్తూ రామాంజనేయ యుద్ధం సినిమాలో ఆయన రాసిన శ్రీకరమౌ శ్రీరామనామం జీవామృత సారం...పాటలో రాముణ్ణి వివిధ కోణాల్లో ఆయన ఆవిష్కరించిన తీరు అనితర సాధ్యం. గోరంతదీపం సినిమాలో రాయినైనా కాకపోతిని...పాట నిజానికి ఆయన ప్రైవేటుగీతం. అదివిన్న బాపు-రమణలు ఆ గ్రామఫోను కంపెనీవారివద్ద ఆ గీతం హక్కులు తీసు 'కొని' మరీ తమ సినిమాలో సందర్భానికి వాడుకున్నారు. ఆ పాటవిని సి.నా.రె. ''జీవితకాలం మొత్తానికి ఇలాంటి పాట ఒక్కటి రాస్తే చాలు - జన్మ ధన్యం అవుతుంది'' అంటూ ఆరుద్రను ప్రశంసించారు. అలాగే సీతాకళ్యాణం సినిమాలో సీతమ్మకు సింగారము చేతమురారమ్మ...పాట. 1956లో వచ్చిన పెంకిపెళ్లాం సినిమాలో ఆయన ఒక పాట రాశారు, పడుచుదనం రైలుబండి పోతున్నది... పడుచువాళ్లకందులో చోటున్నది...అని. ఆయన ఎక్కవలసిన రైలు ఎక్కేశారు. దిగవలసిన స్టేషన్ వచ్చేసింది. దిగేశారు. కానీ దిగేముందు భాగవతం టీవీ సీరియల్‌కోసం సుందరాకాండను అరవై నిముషాల పాటగా మలచి ఇచ్చి బాపు-రమణల పట్ల తనకున్న మమకారాన్ని మరోసారి చాటి మరీ దిగిపోయారు. ఆయన నాస్తికుడు. కానీ సినిమాపాటతోసహా తాను ఏ ప్రక్రియ చేపట్టినా మనసా వాచా అందులో ప్రత్యేకత కనపరిచేందుకు అహరహం పరితపించేవారు. ముళ్లపూడి చెప్పినట్టు ఆరుద్ర అక్షర శరీరుడు, పరిశోధనా పరమేశ్వరుడు.